బీఆర్ఎస్‌లో నయా జోష్


మీర్‌పేట: సభాస్థలికి ర్యాలీగా వస్తున్న మంత్రి సబిత, ఎంపీ రంజిత్‌రెడ్డి


అభివాదం చేస్తున్న సబితాఇంద్రారెడ్డి

- మీర్‌పేటలో యువగర్జన సభ
- భారీగా తరలిచ్చిన యువకులు
- బైకు, కార్ల ర్యాలీగా సభాస్థలికి చేరుకున్న మంత్రి
- మంత్రి సబితారెడ్డి గెలుపు ఖాయం.. ఎంపీ రంజిత్‌రెడ్డి

మీర్‌పేట: యువగర్జనతో బీఆర్ఎస్‌లో నయా జోష్ కనిపించింది. ఆదివారం సాయంత్రం నిర్వహించిన యువగర్జన సభకు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డికి మద్దతుగా వేలాది మంది యువత కదం తొక్కారు. మీర్‌పేట పరిసర ప్రాంతమంతా జై సబితమ్మ... జై బీఆర్ఎస్.. జై కేసీఆర్ నినాదాలతో మార్మోగించారు. యువకుల భారీ బైకు, కార్ల ర్యాలీతో దారులన్నీ గులాబీమయం అయ్యాయి. భారీ ర్యాలీతో సభాస్థలికి చేరుకున్న మంత్రి సబితారెడ్డి యువతనుద్దేశించి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం యువత పక్షపాతి అని, రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ యూనివర్సిటీల నుంచి విద్యార్థి యువ నాయకులను ప్రోత్సహించి అసెంబ్లీకి, పార్లమెంటుకు పంపడంతో పాటు కార్పొరేషన్లు, కమిషన్‌లకు చైర్మన్‌లుగా, మేయర్లుగా చేసి యువజన సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఏ పార్టీకి లేనంత యువసైనికులు బీఆర్ఎస్‌కు మాత్రమే ఉన్నారని, ఇప్పటికే 1 లక్షా 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి లక్షలాది మంది ఉద్యోగులను రోడ్డున పడేసిందని విమర్శించారు. దేశమంతా కొత్త విద్యాసంస్థలు ఏర్పాటు చేసినా తెలంగాణకు ఒక్కటి కూడా ఇవ్వలేదని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలను రాకుండా బీజేపీ నాయకులు చేశారని దుయ్యబట్టారు. అయినా జిల్లాకో మెడికల్ కాలేజీ మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందన్నారు. వందల గురుకులాలు ఏర్పాటు చేసి విద్యాహబ్‌గా మార్చుకున్నామని వివరించారు. ఓ వైపు ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే మరో వైపు ప్రైవేటు రంగంలో 24 లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించిందని ఆమె తెలిపారు. యువత మనసు తెలిసిన నాయకుడు కేసీఆర్ అని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నామని వివరించారు. అభివృద్ధి ఫలాలు రానున్న కాలంలో యువతకు దక్కుతాయని, సమాజం కోసం పనిచేసే బీఆర్ఎస్ ప్రభుత్వానికి యువత ఎల్లప్పుడు అండగా ఉండాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. యువగర్జనకు హాజరైన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి యువ నాయకులు పటోళ్ల కార్తీక్‌రెడ్డిలు మాట్లాడారు. ఒక్క పిలుపుతో సబితమ్మకు మద్దతుగా వేలాది మంది యువత తరలి రావడంతో రానున్న ఎన్నికల్లో సబితమ్మ గెలుపు ఖాయమైందని, యువత అంతా గెలుపులో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో ఇదే జోరు, ఉత్సాహంతో కారు గుర్తుకు ఓట్లు వేసి గెలపించాలని అభ్యర్థించారు. ప్రముఖ గాయకులు ఏపూరి సోమన్న పాటలతో హోరెత్తించారు.


యువగర్జనకు భారీగా తరలివచ్చిన యువకులు

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి

మహేశ్వరం: ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమంగా నిల్వ చేసిన మద్యం షాపులపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాలు, తండాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం, నాటు సారా, బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దాడుల్లో 1600 లీటర్ల బెల్లం పానకం, 18 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు హన్మంతు నాయక్, ప్రవీణ్‌కుమార్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు బీఎస్పీతో మేలు

కొత్త మనోహర్‌రెడ్డి


మాట్లాడుతున్న కొత్త మనోహర్‌రెడ్డి

మీర్‌పేట: కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల మేలు కోరేది ఒక్క బీఎస్పీ పార్టీ మాత్రమేనని మహేశ్వరం నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మా ట్లాడుతూ.. తనకు టికెట్ కేటాయించినందుకు బీఎ స్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానికేతరులకు ఈ ఎన్నికల్లో డిపాజిట్ దక్కదని, స్థానికుడినైన తనను గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజలు ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లింగం, ఇన్‌చార్జి మహేష్‌చారి, నియోజకవర్గ అధ్యక్షుడు జి.శ్రీనివాస్, మహిళా కన్వీనర్ ఇందుమతి, స్వప్న యాదవ్, నర్సింహ్మా, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డీఎస్పీలో పలువురి చేరిక

కందుకూరు: అణగారిన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడమే లక్ష్యంగా ధర్మ సమాజ్ పార్టీ పని చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్‌మహారాజ్ పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి గుండ్రపల్లి అమరేందర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధిలోని లేమూరు, సాయిరెడ్డిగూడ గ్రామాలకు చెందిన పలువురు పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యం, భూమి, సంపదకు దూరమయ్యారని అన్నారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు అభివృద్ధి చెందడమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు సీహెచ్ ఆంజనేయులు, జి.మహిపాల్, వై.రాజు, జి.ప్రశాంత్, సీహెచ్ ధనరాజ్, సీహెచ్ బాల్‌రాజు, వి.మహేష్, జి.భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయం తథ్యం


మీర్‌పేట: చల్లా నర్సింహారెడ్డి, కేఎల్‌ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యువకులు


హుడాకాంప్లెక్స్: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు


బడంగ్‌పేట్: క్రికెట్ ఆడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం తథ్యమని పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట, గుమ్మడవెల్లి, ఆకులమైలారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజారంజక పాలనను అందిస్తామన్నారు. బీఆర్ఎస్, బీజేపీలకు పాలించే అర్హతే లేదని విమర్శించారు. ప్రజలను పట్టి పీడిస్తున్న ఆ పార్టీలకు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ నాయకులు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణనాయక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన యువత

మీర్‌పేట: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలన కోరుకుంటున్నారని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ దాసరి నారాయణ కాలనీలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన 50 మంది యువకులు సైదులు యాదవ్, రవియాదవ్, పరమేశ్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నర్సింహారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు యువకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు జంగారెడ్డి, శ్రీశైలం, యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మురళీగౌడ్‌లు ఉన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి జిల్లెలగూడ చందన చెరువు వద్ద మార్నింగ్ వాక్‌లో పాల్గొని వాకర్స్‌తో మాట్లాడి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు.

బ్యాట్ పట్టిన కేఎల్‌ఆర్

బడంగ్‌పేట్: నిన్నటిదాక ఐటీ దాడులతో సతమతమైన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బడంగ్‌పేటలోని సిరిపురం యాదయ్య స్మారక మైదానంలో వాకర్స్‌ను కలిసి చేయి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. క్రికెట్ ఆడుతున్న యువకుల ద్దకు వెళ్లి కొద్ది సేపు కికెట్ ఆడారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, జంగారెడ్డి, మల్లారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, యాదిరెడ్డి, జగన్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీతోనే పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం ఆ పార్టీ అభ్యర్థి కిచెన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం సరూర్‌నగర్ చౌడీ సమీపంలోని గాంధీ విగ్రహానికి లక్ష్మారెడ్డి పూలమాల వేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఇచ్చిన పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలన్నారు. ఆరు హామీలను ప్రజలకు తెలియజేస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహాడ్డి, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, బండి మధుసూదన్‌రావు, జంగారెడ్డి, అధికార ప్రతినిధి గౌరు సతీష్, కిషోర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, శివప్రసాద్, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గమే లక్ష్యం

కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్


ప్రచారంలో పాల్గొన్న లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్‌ఆర్) అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని రామకృష్ణ పురం డివిజన్‌లో వేలాది మందితో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు హామీలు అధికారంలో వచ్చిన వెంటనే తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, నాయకులు బండి మధుసూదన్ రావు, చిలుక ఉపేందర్‌రెడ్డి, శివ ప్రసాద్, ధనరాజుగౌడ్, రవీంద్ర, బొక్క భూపాల్ రెడ్డి, ఆనంద్, ఏవి రావు, శ్రీశైలం, మణికంఠ దల్లి, మహమ్మద్ గులష్, కృష్ణ, నగేష్, ఇమ్రాన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కేపురం డివిజన్‌లో..

ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని విజయపురికాలనీ, ఎస్‌బీఐ కాలనీలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్ల రవీంద్ర ఆధ్వర్యంలో అభ్యర్థి లక్ష్మారెడ్డి గెలిపించాలని గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్‌వీ రావు, ఆనంద్ గోపాల్ రావు, శివ, సుశీల, శ్రీకాంత్‌రెడ్డి, సందీష్, నాగేశ్వ రావు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

మహేశ్వరం: కమలం గుర్తుకు ఓటు వేసి మహేశ్వరంలో బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మంఖాల్, ఇమామ్‌గూడ, రావిర్యాల, సర్దార్‌నగర్, తుక్కుగూడ గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే బీజేపీని గెలిపిస్తాయన్నారు. దేశం, ధర్మం కోసం పాటుపడే పార్టీ బీజేపీయేనని అన్నారు. సుస్థిర, సుపరిపాలన అందించడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తోందన్నారు. తెలంగాణలో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు కై వసం చేసుకొని డబుల్ ఇంజన్ సర్కార్‌ను ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం అభ్యర్థిగా బీసీని ప్రకటించడం బీజేపీకే చెందిందన్నారు. మహేశ్వరంలో బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్‌ఆర్‌ను చిత్తుగా ఓడించి మహేశ్వరం గడ్డపైన కమలం జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, కౌన్సిలర్లు శివకుమార్‌గౌడ్, ఆర్.రాజు, విలాస్, బీజేపీ నాయకులు జయరాజ్,రాజు గౌడ్, శివయ్య, సుధాకర్, మహేందర్ పలువురు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తాం

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయం జెండా ఎగురవేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్‌తో కలిసి ఆయన శనివారం రాత్రి మండల పరిధిలోని తిమ్మాపూర్, సరస్వతిగూడ, లేమూరు, గుమ్మడవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి సబితారెడ్డి నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. అనంతరం శ్రీరాములుయాదవ్ మాట్లాడుతూ.. కేంద్ర నిధులు తప్పా, గ్రామాలకు మంత్రి సబితారెడ్డి తెచ్చిన నిధులు ఎన్నో చెప్పాలని డిమాండ్ చేశారు. మహబూబ్‌నగర్ నుంచి తిమ్మాపూర్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కృషి చేశారన్నారు. డిసెంబర్ 3 వచ్చే ఫలితాల్లో బీజేపీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కార్యకర్తలు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు కృష్ణగౌడ్, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఎంపీపీ జ్యోతి, పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు, కొత్తగూడ సర్పంచ్ సాధ మల్లారెడ్డి, జిల్లా నాయకులు జంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, మల్లేష్, బాలరాజు, పాల్గొన్నారు.

కారు జోరు.. ప్రచార హోరు


బడంగ్‌పేట్: 28వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ అర్జున్


హుడాకాంప్లెక్స్: మంత్రి సబితాఇంద్రారెడ్డితో సీనియర్ సిటిజన్స్

- నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల ముమ్మర ప్రచారం
- అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి.. సబితారెడ్డి

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో బీఆర్ఎస్ ప్రచారం జోరందుకుంది. పలు డివిజన్‌ల్లో ఆయా కార్పొరేటర్లు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. 28వ డివిజన్‌లోని నైస్‌హిల్స్, వసంత్‌విహార్, సప్తగిరి కాలనీల్లో కార్పొరేటర్ ఎస్.అర్జున్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కారుకు ఓటు వేసి మంత్రి సబితారెడ్డిని మరోమారు గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో యాదయ్య, చారి తదితరులున్నారు. అలాగే, 29వ డివిజన్‌లోని గాంధీనగర్‌లో స్థానిక కార్పొరేటర్ శోభ ఇంటింటికి తిరిగి సబితారెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆనంద్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మల్లేష్ తదితరులున్నారు. 30వ డివిజన్‌లోని ఎంసీఆర్, రోమా–2, కాలనీలో స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న ప్రచారం నిర్వహించారు. మంత్రి సబితారెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో డానియల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

కందుకూరు: మహేశ్వరంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సబితారెడ్డికి మద్దతుగా కందుకూరులో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సబితమ్మతోనే ఈ ప్రాంతం అన్ని విధాల అభివృద్ధి చెందిందన్నారు. మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకే ఓటు వేసి మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కె.రాములు, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిత్ర సాయిలు, పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, డైరెక్టర్లు శేఖర్‌రెడ్డి, ఆనంద్, పాండురంగారెడ్డి, సర్పంచ్ రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ కాకి రాములు, శ్రీధర్, ఎస్.మహేందర్‌రెడ్డి, కాకి రవీందర్, బొక్క దీక్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి మహిళా మండలి మద్దతు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి హుడాకాంప్లెక్స్‌లో ఆదివారం సీనియర్ సిటిజన్స్ ఫోరం మహిళా మండలి సభ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులు మంత్రికి సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపే లక్ష్యంగా పని చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠన కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.


బడంగ్‌పేట్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ శోభ

మరోసారి ఆదరించండి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడకు చెందిన కాంగ్రెస్ నాయకులు మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి, చప్పిడి కొండల్‌రెడ్డి, సంరెడ్డి సంజీవ్‌రెడ్డిల ఆధ్వర్యంలో సుమారు 100 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని తెలిపారు. తనను మరోమారు ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, డా.సాయికుమార్, ప్రశాంత్, శశి, అంజన్, శ్రీధర్, రాజు, సంతోష్, తిరుమల్‌గౌడ్, మహేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులున్నారు.


బడంగ్‌పేట్: 30వ డివిజన్‌లో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ స్వప్నరెడ్డి


బడంగ్‌పేట్: మంత్రి సమక్షంలో పార్టీలో చేరిన అల్మాస్‌గూడవాసులు